


ఎన్ఐపిఇఆర్ సమావేశంలో తిరుపతి ఎంపి

ప్రజాశక్తి-తిరుపతిటౌన్

ఢిల్లీలో భారత ప్రభుత్వంలోని రసాయనాలు , ఎరువుల మంత్రిత్వ, ఫార్మాస్యూటికల్స్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (నైపర్) ఆధ్వర్యంలో ఔషధ శాస్త్రాలలో అధునాతన అధ్యయనాలు, పరిశోధనలకు సంబంధించి పలు చర్చలు జరిగాయి. భారతీయ ఔషధ ప్రమాణాలు మెరుగుపరచడమే అజెండాగా జరిగిన ఈ తొలి సమావేశంలో తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి పాల్గొన్నారు. ఈ జాతీయ సంస్థకు తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి కౌన్సిల్ మెంబర్ గా ఎన్నికైన విషయం విధితమే.

గ్యాస్ భగభగలు

- రూ.50 పెంపుతో రూ.1130కి పెరిగిన ధర
- ఉమ్మడి జిల్లావాసులపై రూ.7 కోట్లపైనే భారం



ప్రజాశక్తి-తిరుపతి టౌన్



గ్యాస్ ధర మళ్లీ పెరిగింది. గృహిణులకు కష్టాలు తప్పడం లేదు. మోడి ప్రభుత్వం రూ 50 రూపాయిలు పెంచడంతో సిలెండర్ ధర రూ.1130కు చేరుకుంది. ఉమ్మడి చిత్తూరుజిల్లా వాసులపై సుమారు 7 కోట్లపైనే భారం పడనుంది. పెరిగిన ధర బుదవారం నుంచి అమల్లోకి వచ్చింది. గత ఏడాది మార్చి, మే, జులై నెలల్లో రూ 150 పెరిగింది. ఈ లెక్కన ఈ ఏడాది డిసెంబర్ నాటికి సిలెండర్ రూ.1500కు చేరవచ్చని అంచానా. అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గినా, గ్యాస్‌ధర ఏమాత్రం తగ్గకపోవడం గమనార్హం.

కేంద్రంలో మోడి ప్రభుత్వం బడ్జెట్ సమావేశాలు ముగిసిన తరువాత గ్యాస్, చమురు ధరలు పెంచేసింది. ధరలు పెంపు విషయంలో ఇటు కేంద్రం, అటు రాష్ట్ర ప్రభుత్వాలు ఏమాత్రం తగ్గడం లేదు. ఇప్పటికే రాష్ట్రప్రభుత్వం ఆర్‌టిసి చార్జీలు పెంచడం వల్ల సామాన్య మద్యతరగతి ప్రజల అవస్థలు వర్ణనాతీతంగా మారింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సుమారు 15,89,752కనెక్షన్లుఉన్నాయి. ఇందులో ఇండియన్ గ్యాస్ సిలిండర్లు 5లక్షల 50వేలు ఉన్నాయి. హెచ్‌పి గ్యాస్ సిలిండర్ సుమారు 7లక్షల86వేలపైగా ఉన్నాయి. భారత్‌గ్యాస్ సుమారు 1లక్ష70వేల కనెక్షన్లు కలిగి ఉన్నట్లు డీలర్లు పేర్కొన్నారు. నిత్యం 75వేల సిలిండర్లు అమ్మకాలు జరుగుతున్నాయి.

2020నుంచి వినియోగదారులకు సబ్సిడి రావడం లేదు. 14.2కిలోల గ్యాస్ సిలెండర్ కు 1105 చెలిస్తే తప్ప సిలిండర్ ఇంటికి వచ్చే పరిస్థితి లేదు. ఎంత పొదుపుగా వాడాలనుకున్న నెలరోజులకు మించి రావడం కష్టంగా ఉంది. ఇంటి అవసరాలకు వినియోగించే వంటగ్యాస్ సిలిండర్ ధర గతఏడాది మార్చి మొదటివారంలో నాటికి రూ 935 ఉండగా మార్చినెల మూడవవారం నుంచి 985కు చేరింది. ఏకంగా రూ 50పెంచి వినియోదారుడిపై ప్రభావం పడింది. మేనెలలో సిలిండర్ కోనుగోలు చేయాలంటే రూ 1035రూపాయిలు చెల్లించి తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. జులై నెలల్లో కేంద్ర ం మరో 50రూపాయిలు పెంచడంతో సింగిల్ సిలిండర్ ధర డెలివరి బాయ్‌కు రూ50కలిపి రూ 1105రూపాయలకు చేరుకుంది. ప్రసుత్తం 50పెంచడం వల్ల 1130తిరుపతి లో ఈధర చెల్లించి సిలిండర్ తీసుకుంటున్నారు. ఇటు గ్యాస్, అటు అన్ని వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఏం కోనుగోలు చేసిన పర్సు ఖాళీ కావాల్సిందే.



గృహిణులపై పెను భారమే : రాధమ్మ

పెంచిన గ్యాస్ వల్ల గృహిణులపై పెనుభారం పడుతుంది. తక్షణమే గ్యాస్ ధరలు తగ్గించాలి. కేంద్ర ప్రభుత్వం ఇష్టం వచ్చిన్నట్లు గ్యాస్‌ధరలు పెంచితే సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఎలా బతకాలి. ఇప్పటికే అన్ని వస్తువుల ధరలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతుంటే గ్యాస్‌పై రూ 50పెంచడం దారుణం. ధరలు తగ్గించకపోతే మహిళలు పెద్ద ఎత్తున ఆందోళన చేయాల్సి వస్తుంది.

పోరాటం చేస్తేనే : లక్ష్మి



గ్యాస్ ధరలు తగ్గించకపోతే మహిళలు పెద్ద ఎత్తున పోరాటం చేస్తారు. దీంతో ప్రభుత్వం దిగి రాక తప్పదు. ఎన్నాళ్లని ధరల భారంతో ప్రజలు ఇబ్బందులు పడుతూ బతుకుతారు. సహనం నశిస్తే పోరాటాల్లోకి తప్పనిసరిగా వస్తారు. ఇలా పెంచుకుంటూ పోతే గ్యాస్ రూ 2వేలరూపాయిలు పెంచిన ఆశ్చర్యం లేదు. ధరలు తగ్గించే వరకు మహిళలు పోరాటాల్లో ముందుండాలి.

ఎందుకు తెచ్చినట్లు..ఎందుకు తగ్గినట్లు..!

- తిరుపతి ఎంఎల్ఎకే తెలియకుండానే జరిగిందా..?
- 22ఎ మెడమీద కత్తేనంటున్న ప్రతిపక్షం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుమల తిరుపతి దేవస్థానం ఆనవాయితీ బోర్డులో ఏ నిర్ణయం చేసినా ర్యాటిఫికేషన్ కోసం ప్రభుత్వానికి పంపించాల్సిందే.. చిన్నాచితక అధికారులకు ఇది సాధ్యం కాదు.. స్థానిక ప్రజాప్రతినిధుల అనుమతి, బోర్డు సభ్యుల తీర్మానం మేరకే టిటిడి కార్యనిర్వహణాధికారి సంతకంతో ప్రభుత్వ అనుమతి తెచ్చుకోవాల్సి ఉంది. అది పెద్ద నిర్ణయమైనా, చిన్న తీర్మానమైనా.. అయితే 22ఎ సెక్షన్ తెచ్చి ' ఈ భూములన్నీ మావే... రిజిస్ట్రేషన్ చెల్లవు' అంటూ మూడువేల ఎకరాలపై టిటిడి ఉచ్చు బిగించింది. రిజిస్ట్రేషన్లు ఆగిపోవడంతో నగరప్రజల్లో ప్రకంపణలు చెలరేగాయి. ప్రతిపక్షాలు రోడ్డుపైకి వచ్చాయి.. తిరుపతి భూముల పరిరక్షణ సాధన కమిటీ ఆధ్వర్యంలో పోరాటాలను రూపుదిద్దుకున్నారు. మీడియాలో పతాక శీర్షికలతో కథనాలు వెలువడ్డాయి. దీంతో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డ అధికార పార్టీ తమకు తెలియకుండానే ఇదంతా జరిగిందంటూ ముసలి కన్నీరు కార్చే ప్రయత్నం చేసింది.



కలెక్టర్ ఎఒకు వినతిపత్రం ఇస్తున్న భూముల పరిరక్షణ సాధన సమితి

టిటిడి భూములను కాపాడుకునేందుకు టిడిపి హయాంలో ప్రభుత్వం నుంచి 2002లో 781 జీవోను తీసుకొచ్చి 'తిరుపతి అంతా మాదే' అంటూ నోటీసులు జారీ చేసింది. ఒక్కసారిగా ఉలిక్కిపడిన తిరుపతి జనం రాజకీయాలకు అతీతంగా రోడ్లపైకి వచ్చారు. టిటిడి పరిపాలనా భవనాన్ని వేలాదిమందితో 40 రోజుల పాటు ముట్టడించారు. వందలాది మందిని అరెస్టులు చేశారు. నాన్‌బెయిలబుల్ కేసులు పెట్టారు. ఐదు రోజులు జైళ్లలో ఉన్నవారిలో ప్రస్తుత వైసిపి ఎంఎల్ఎ భూమన కరుణాకర్‌రెడ్డి ఒకరు. ఎట్టకేలకు అప్పటి ప్రభుత్వం స్పందించి ఆ జీవోను వెనక్కి తీసుకుంది. దీంతో నగర ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన కొత్తలో ఇనాం కోర్టులోనూ 1500 ఎకరాలు టిటిడి ఆస్తులని 2019, ఆగస్టులో తీర్పు వచ్చింది. అందులో ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్, కొర్లగుంట తదితర ప్రాంతాలన్నీ ఉన్నాయి. అయితే ఆ తీర్పు అమలు కాకుండా రాష్ట్ర ప్రభుత్వం తొక్కిపెట్టింది. ఇప్పటికీ ఆ తీర్పు అమలు కాలేదు. ప్రస్తుతం 22ఎ సెక్షన్ ప్రకంపణలు ఇప్పటివి కాదు. ఏడాదిగా టిటిడి కసరత్తు చేస్తూనే ఉంది. టిటిడి ఆస్తిని గుర్తించాలనుకుంటే ప్రభుత్వ రెవెన్యూ అధికారుల సహకారంతో సబ్ డివిజన్ చేసుకుని '22ఎ' సెక్షన్ తీసుకురావాల్సి ఉంది. అయితే సబ్ డివిజన్ చేయకనే 250 సర్వే నంబర్లలో ఉన్న 3వేల ఎకరాలు తమవేనంటూ దేవాదాయ శాఖ కమిషనర్‌కు టిటిడి లేఖ రాసింది. సబ్‌డివిజన్ తేల్చకనే ఎండోమెంట్‌కమిషనర్ సైతం రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ అధికారికి 'అమలు ఉత్తర్వులను' జారీ చేయడం గమనార్హం. ప్రతిపాదన పంపేటపుడు టిటిడి బోర్డులో చర్చ జరిగి, ఈవో సంతకంతోనే లేఖ వెళ్లినట్లు సమాచారం. టిటిడి బోర్డులో సభ్యులుగా తిరుపతి ఎంఎల్ఎ భూమన కరుణాకర్‌రెడ్డి, చంద్రగిరి ఎంఎల్ఎ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఉన్నారనడంలో ఏమాత్రం సందేహం లేదు. ప్రస్తుతం ఎంఎల్‌సి ఎన్నికల సందర్భంగా '22ఎ' ప్రకంపణలు ఆ పార్టీ పట్ల పెద్దఎత్తున వ్యతిరేకత వచ్చింది. ఈ నేపథ్యంలో ఎంఎల్ఎ కరుణాకర్‌రెడ్డి వెంటనే ప్రతిస్పందిస్తూ '22ఎ' లేఖ తనకు తెలియదని, అయినా తాను జోక్యంచేసుకుని తిరుపతి ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా రిజిస్ట్రేషన్లు చేసుకునే విధంగా చూస్తానని హామీ ఇచ్చిన మరుసటిరోజే దేవాదాయ శాఖనుంచి లేఖ తెప్పించడం గమనార్హం. అయితే ప్రతిపక్షాలు మాత్రం ఇది తాత్కాలిక విరమణే తప్ప శాశ్వత పరిష్కారం కాదని, అసెంబ్లీలో చట్టం చేస్తే తప్ప, ఎప్పటికైనా '22ఎ' తిరుపతి ప్రజలకు మెడమీద కత్తేనన్న విమర్శలూ లేకపోలేదు.

తిరుపతి భూములపై శాశ్వత పరిష్కారం చూపాలి!

తిరుపతిలోని భూములను నిషేధిత జాబితాలో 22ఎ చేర్చడంతో ప్రజలు ఆందోళన చెందారని, ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతూ బుధవారం తిరుపతి భూముల పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో కలెక్టర్ ఏవోకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తిరుపతి భూముల పరిరక్షణ వేదిక కన్వీనర్ సాకం సుధాకర్, కో కన్వీనర్ ఏ.రాధాకష్ణ మాట్లాడుతూ తిరుపతిలో పలు ప్రాంతాల్లో ఉన్న 3000 ఎకరాల భూములు టిటిడి కి సంబంధించినవని, ఈ భూములు పై రిజిస్ట్రేషన్లు ఆపాలని దేవాదాయ శాఖ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ డిపార్ట్మెంట్ కు ఆదేశాలు జారీ చేసిందని అన్నారు. దీంతో తిరుపతిలో ఉన్న ఆయా ప్రాంత ప్రజలు తీవ్రమైన ఆందోళన చెందారని, ప్రజలకు మద్దతుగా భూముల పరిరక్షణ వేదిక ఏర్పాటు చేశామని అన్నారు. తిరుపతి ప్రజలు చేపట్టిన పోరాట ఫలితంగా ప్రభుత్వం దిగివచ్చి అభ్యంతరం లేని సర్వే నంబర్ల భూములను రిజిస్ట్రేషన్లు చేయవచ్చునని సంబంధిత శాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. అయితే ఇది శాశ్వత పరిష్కారం కాదని, ఏదో ఒక సాకు చూపించి తిరుపతి ప్రజల జీవితాలతో చెలగాటమడే అవకాశం ఉందని, ఇప్పటికైనా ప్రభుత్వం తిరుపతి భూములపై శాశ్వత పరిష్కారానికి ప్రత్యేక ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. తిరుపతిలో ఉన్న భూ సమస్యలపై తిరుపతి భూముల పరిరక్షణ వేదిక నిరంతరం కృషి చేస్తుందని ప్రకటించారు. వినతిపత్రం సమర్పించిన వారిలో వి.నాగరాజు, మిరియం వెంకటేశ్వర్లు జే.విశ్వనాథ్, ఎన్.డిరవి, వెంకటరత్నం, వెంకయ్య పాల్గొన్నారు.

టిటిడి బేషరతుగా క్షమాపణ చెప్పాలి : నవీన్

తిరుపతిలో '22ఎ' అన్ని వర్గాలప్రజలను గందరగోళానికి నెట్టేసిందని, ఉద్యోగులు, వ్యాపారులు, మధ్యతరగతి కుటుంబాలు అప్పోసప్పో చేసి కొన్న ప్లాట్లు, అపార్టుబమెంట్ల కింద నిషేధిత భూముల జాబితాలో ఉన్నాయని మానసికంగా కుంగిపోయారని రాయలసీమ పోరాట కమిటి కన్వీనర్ నవీన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. టిటిడి బేషరతుగా తిరుపతి ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

4 నాటికి పోలింగ్ మెటీరియల్ సిద్ధం : కలెక్టర్

బందోబస్తుకు 1601 మంది నియామకం : ఎస్‌పి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: జిల్లాలో పోలింగ్ నిర్వహణకు అవసరమైన పోలింగ్ సామాగ్రి ఈ నెల 4 నాటికి సిద్ధం చేస్తున్నామని, పి.ఓ., ఎ.పి.ఓ.ల శిక్షణ రెండవ విడత ఈ నెల 9 న నిర్వహించనున్నామని కలెక్టర్ కె.వెంకటరమణా రెడ్డి వివరించారు. పోలింగ్ బందోబస్తు ఏర్పాట్లకు జిల్లా పోలీసులను 1136, ఆర్మ్డ్ ఫోర్స్ 465 మంది అవసరముందని ఎస్‌పి పరమేశ్వర్ రెడ్డి వివరించారు. బుధవారం మద్యాహ్నం అమరావతి నుండి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా ఎం.ఎల్.సి. ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై ఎన్నికలు జరుగుతున్న జిల్లాల కలెక్టర్ లతో , ఎస్.పి. లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్.పి. , నగరపాలక కమీషనర్ అనుపమ అంజలి, డి.ఆర్.ఓ. శ్రీనివాసరావు, అడిషనల్ ఎస్‌పి లు కులశేఖర్, వెంకట రావు, ఆర్.డి.ఓ. లు రామారావు, కనకనరసారెడ్డి హాజరయ్యారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి మాట్లాడుతూ ఓటర్ స్లిప్స్‌ను మార్చి 8 నాటికి పంపిణీ పూర్తి చేసి అదే రోజు సాయంత్రం కల్లా లేదా మరుసటి దినం 9 న ఉదయం ఓటర్ స్లిప్స్ పంపిణీ చేసిన రసీదులు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయానికి పంపాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన జరగకుండా పకడ్బందీగా అమలు చేయాలని, ఉల్లంఘనలు ఉంటే వాటిపై ఎన్నికల నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగస్తులు ఎవరూ ఎన్నికల ప్రచారంలో పాల్గొన రాదని, ఎన్నికల ప్రచారం కొరకు పార్టీలు ప్రభుత్వ భవనాలు, సంస్థలు, సామాగ్రిని వినియోగించరాదని, అతిక్రమించిన వారి పై క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ జిల్లాలో పోలింగ్ నిర్వహణపై వివరిస్తూ పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి 62 పోలింగ్ కేంద్రాలు అనుబంధంగా 39 అక్సలరీ పోలింగ్ కేంద్రాలు, ఉపాధ్యాయ నియోజకవర్గానికి సంబంధించి 37 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని బుధవారం ఉదయం పోలింగ్ ప్రిసైడింగ్ అధికారులకు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ పూర్తి చేశామని, ఈ నెల 9 న మరోమారు శిక్షణను ఇవ్వనున్నామని అన్నారు. 138 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి పి.ఓ., ఎ.పి.ఓ. ల నియామకం, 20 శాతం అదనంగా సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టామని తెలిపారు. 78 మంది మైక్రో అబ్జర్వర్లను నియమిస్తున్నామని, పోలింగ్ కేంద్రాలలో వెబ్ క్యాస్టింగ్ ఏర్పాటుకు ఏజన్సీ నియామకం జరిగిందని, వీడియో రికార్డింగ్ చేపట్టనున్నామని వివరించారు. పోలింగ్ విధులు నిర్వహిస్తున్న వారికి పోస్టల్ బ్యాలెట్ అందించడానికి వివరాలను సిద్ధం చేశామని తెలిపారు. జిల్లా ఎస్.పి. వివరిస్తూ పోలింగ్ రోజు బందోబస్తు ఏర్పాట్లకు సివిల్ ఫోర్స్ కు సంబంధించి నలుగురు అడిషనల్ ఎస్.పి.లు, ఎనిమిది మంది డి.ఎస్.పి. లు, 29 మంది సి.ఐ.లు, 62 మంది ఎస్.ఐ.లు, 202 ఎ.ఎస్.ఐ. లు/ స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, 692 మంది పోలీసులు, 138 మంది హెూం గార్డు నియామక ప్రణాళిక సిద్ధం చేశామని, ఆర్మ్ డ్ ఫోర్స్ 465 మంది అవసరమని కోరామని వివరించారు. క్రిటికల్, హైపర్ క్రిటికల్ పోలింగ్ కేంద్రాల వద్ద గత ఎన్నికల అనుభవాలను దష్టిలో పెట్టుకుని బందోబస్తు ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టనున్నామని వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఎ.పి.ఐ.ఐ.సి. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పోలింగ్‌లో పీవో, ఏపీవోలు కీలకం

13న ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్



మహిళా వర్సిటీ ఆడిటోరియంలో పీవోలకు, ఏపీవోలకు శిక్షణ ఇస్తున్న ఎన్నికల అధికారి కె.వెంకటరమణారెడ్డి

ప్రజాశక్తి - క్యాంపస్ : ఈ నెల 13న జరగనున్న ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్‌లో పి.ఓ.లకే కీలక బాద్యతలు ఉంటాయని, పి.ఓ. హ్యాండ్ బుక్ ను చదివి అర్థం చేసుకొని శిక్షణా సమయంలో సందేహాలను నివృత్తి చేసుకోవాలని కలెక్టర్ కె.వెంకటరమణా రెడ్డి అన్నారు. బుధవారం ఉదయం స్థానిక శ్రీ పద్మావతీ మహిళా విశ్వ విద్యాలయం ఆడిటోరియంలో పోలింగ్ ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు ఇచ్చిన శిక్షణా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కె.వెంకటరమణా రెడ్డి పాల్గొని ఎన్నికల విధులలో నిర్వహించాల్సిన అంశాలపై సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 13న ప్రకాశం- నెల్లూరు- చిత్తూరు ఎం.ఎల్.సి. ఎన్నికలకు సంబంధించి ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గాలకు పోలింగ్ జరగనున్నదని, పోలింగ్ సమయం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించాలని అన్నారు. పి.ఓ.లకు , ఎ.పి.ఓ.లకు నేటి శిక్షణతో పాటు మరో శిక్షణ ఈ నెల 9 న నిర్వహించ నున్నామని అందులో ప్రధానంగా బ్యాలెట్ బాక్సులను ఎలా ఓపెన్ చేయాలి, పోలింగ్ ముగింపు తర్వాత సీల్ వేయడం వంటివి పవర్ పాయింట్ ప్రజంటేషన్ అనంతరం డమ్మీ మాడల్ బ్యాలెట్ బాక్సుల వాడకం విధానం స్వయంగా ప్రతి ఒక్కరూ చూసి నేర్చుకోవాలని అన్నారు. పోలింగ్ ముందు రోజు ఈ నెల 12 న జిల్లాలోని ప్రతి రెవెన్యూ డివిజన్ కేంద్రంలో పోలింగ్ సామగ్రి పంపిణీ వుంటుందని, సూచించిన సమయానికి ఆలస్యం లేకుండా చేరుకోవాల్సి వుటుందని అన్నారు. పోలింగ్ కేంద్రాల్లో వసతులు పరిశీలించి ఏదైనా అవసరమనిపిస్తే స్థానిక తహసిల్దార్ సహాయం తీసుకోవాలని, 100 మీటర్ల మార్కింగ్ ఏర్పాటు చూసుకోవాలని పోలింగ్ రోజు ఇతరులు ఎవ్వరూ ఆ పరిధిలో లేకుండా చూడాలని అన్నారు. పోలింగ్ రోజు ఉదయం 7 గంటల కల్లా పోలింగ్ కేంద్రం లో వసతులు, ఏజంట్ల పాసులు పంపిణీ, సీటింగ్ ఏర్పాట్లు పూర్తి కావాలని 8 గంటలకు పోలింగ్ ప్రారంభం అయ్యేలా చూడాలని అన్నారు. పోలింగ్ బూత్ లో ఓటు వేసే ప్రక్రియ ఎవరికీ కనబడకుండా క్యాబిన్ ఏర్పాటు ఉండాలని, వెబ్ కెమరాలు ఆ విధంగా అమర్చాల్సి ఉంటుందని అన్నారు. అనివార్య కారణాల వల్ల పి.ఓ. హాజరు కాలేకున్నా ఎ.పి.ఓ. నే పి.ఓ. గా వ్యవహరిస్తారని సహాయకులుగా ఓ.పి.ఓ. లు ఇద్దరు ఉంటారని అన్నారు. పోలింగ్ స్లిప్పు, ఎన్నికల కమీషన్ సూచించిన ఏదేని గుర్తింపు కార్డు కలిగిన ఓటర్ కు బ్యాలెట్ అందించేటప్పుడు సరైన విధంగా బ్యాలెట్ మీరే మొదట నిలువు మడత, ఆపిదప అడ్డంగా మడతతో అందించి, ఓటరు పెన్నుతో అంకెలు రాసిన అనంతరం బ్యాలెట్ ను అదే విధంగా మడత పెట్టి బ్యాలెట్ బాక్సులో వేయాలని సూచించాలని, ఎవరైనా బ్యాలెట్ ను బయటకు తీసుకుని వెళితే అక్కడే ఉన్న ఎస్.హెచ్.ఓ కు డిక్లరేషన్ అందించి పి.ఓ. కేసు నమోదు చేయించాలని అన్నారు. పోలింగ్ ముగింపు అనంతరం ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్సులను సీల్ చేసి సంతకాలు తీసుకుని డివిజన్ కేంద్రంలో ఏర్పాటు చేసిన రిసెప్షన్ సెంటర్ స్ట్రాంగ్ రూమ్ కు చేర్చాల్సి ఉంటుందని, పోలింగ్ ప్రక్రియ లో ఎప్పటికప్పుడు నింపిన పి.ఓ. డైరీ, ఇతర ప్రొఫార్మాలను పూరించి అందించాల్సి ఉంటుందని అన్నారు. చిన్న పొరపాటుకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ జరగాలని అన్నారు. అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, జి.ఎం.ఎస్.ఎస్. స్పెషల్ డిప్యూటి కలెక్టర్ కోదండరామిరెడ్డి , తిరుపతి, శ్రీకాళహస్తి ఆర్ డి ఓ లు కనకనరసా రెడ్డి, రామారావు పోలింగ్ పక్రియ, అనుసరించాల్సిన విధానం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించి, పి.ఓ., ఎపిఒ లకు డమ్మీ బ్యాలెట్ పేపర్, డమ్మీ బ్యాలెట్ బాక్సుల వాడకం పై శిక్షణ ఇచ్చి అవగాహన కల్పించారు.

ఈ శిక్షణా కార్యక్రమంలో నగరపాలక కమిషనర్ అనుపమ అంజలి, డిప్యూటి కమిషనర్ చంద్రమౌళీశ్వర రెడ్డి, తహసిల్దార్లు, ఎఇఆర్‌ఓలు వెంకటరమణ , జరీన పాల్గొన్నారు.

తిరుపతి జిల్లా పట్టభద్రుల వివరాలు :

గూడూరు డివిజన్, పోలింగ్ కేంద్రాలు 11, ఓటర్లు 18,761
సూళ్లూరుపేట డివిజన్, పోలింగ్ కేంద్రాలు 11, ఓటర్లు 15,238
శ్రీకాళహస్తి డివిజన్, పోలింగ్ కేంద్రాలు 11, ఓటర్లు 15,043
తిరుపతి డివిజన్, పోలింగ్ కేంద్రాలు 29, ఓటర్లు 37,899
మొత్తం పట్టభద్రుల ఓటర్లు: 86,941

తిరుపతి జిల్లా ఉపాధ్యాయ వివరాలు :

గూడూరు డివిజన్, పోలింగ్ కేంద్రాలు 8, ఓటర్లు 1345
సూళ్ళురుపేట డివిజన్, పోలింగ్ కేంద్రాలు 9, ఓటర్లు 893
శ్రీకాళహస్తి డివిజన్, పోలింగ్ కేంద్రాలు 8, ఓటర్లు 811
తిరుపతి డివిజన్, పోలింగ్ కేంద్రాలు 12, ఓటర్లు 3083
మొత్తం ఉపాధ్యాయ ఓటర్లు:6132

టిడిపి వస్తే పాత ఫీజు రీయింబర్స్‌మెంట్

'యువగళం' పాదయాత్రలో నారా లోకేష్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

టిడిపి అధికారంలోకి వస్తే పాత ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తామని, జగన్ పాలనలో విద్యాదీవెన, వసతి దీవెన అంటూ పనికిమాలిన పథకాలు తెచ్చి విద్యార్థులకు ఫీజులు చెల్లించలేక తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వచ్చేఎన్నికల్లో యువతకు 40 శాతం సీట్లు కేటాయిస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ హామీ ఇచ్చారు. చంద్రగిరి నియోజకవర్గం పాకాల మండలం గాదంకి విడిది కేంద్రం నుంచి 31వ రోజు పాదయాత్ర ప్రారంభమయ్యింది. బుధవారానికి 400 కిలోమీటర్లు పూర్తయిన సందర్భంగా నేంద్రగుంట వద్ద పిహెచ్‌సి ఏర్పాటుకు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఇరంగారిపల్లిలో యువతతో ముఖాముఖి నిర్వహించారు. చంద్రబాబు పాలనలో జాబ్‌క్యాపిటల్ ఆఫ్ ఇండియాగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను జగన్ పాలనలో గంజాయి క్యాపిటల్ ఆఫ్ ఇండియాగా రాష్ట్రం మారిపోయిందన్నారు. టిడిపి హయాంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ ఉండేదని, డైరెక్టుగా కాలేజీలకే డబ్బులు చెల్లించేవాళ్లమన్నారు. జగన్ పాలనలో విద్యాదీవెన, వసతి దీవెన అంటూ



విద్యార్థులతో వాలీబాల్ ఆడుతూ...

పనికిమాలిన పథకాలు తెచ్చి విద్యార్థులకు ఫీజులు చెల్లించలేక తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారంలోకి వస్తూనే పాత రీయింబర్స్‌మెంట్ పథకాన్ని కొనసాగిస్తామని అన్నారు. ఆర్టీసీ బస్సు ఛార్జీలను తగ్గించడంతో పాటు, ఇంజినీరింగ్ సహా ఉన్నత విద్య చదివే అందరికీ ఉచితంగా బస్సుపాసులు అందిస్తామని చెప్పారు. జగన్ పాలనలో అప్పుల రాష్ట్రంగా అయిపోయిందని, ఇప్పటివరకూ 12 లక్షల కోట్లు అప్పుదాటిందన్నారు. వచ్చే ఆదాయం వడ్డీలకే సరిపోతుందన్నారు. ఇలాంటి సంక్షోభం వచ్చినపుడు రాష్ట్రాన్ని కాపాడిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో మార్పు రావాలంటే యువత ఇంట్లో కూర్చుంటే రాదని, రాజకీయాల్లోకి వచ్చి ప్రశ్నించాలన్నారు. అందుకే పాదయాత్ర పేరే యువగళం అని పెట్టామన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే కేజీ నుంచి పీజీ వరకూ ప్రత్యేక పాఠ్యాంశాలు పెడతామని, మహిళలు పడే కష్టాలు, వారి గొప్పతనం, విలువ తెలిసేలా విద్యార్థి దశ నుంచే మహిళలను గౌరవించేలా తీర్చిదిద్దుతామన్నారు. పాదయాత్రలో మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి, నాయకులు పులివర్తినాని పాల్గొన్నారు. బుధవారం ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పాదయాత్ర గాదంకిలో కాపు సామాజికవర్గం నాయకులతో మాటామంతీ సాగింది. నేంద్రగుంట వద్ద శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఇరంగారిపల్లిలో భోజన విరామం. గుమ్మడివారికేంద్రం వద్ద రాత్రి బస చేయనున్నారు.




తిరుమలలో ప్రయోగాత్మకంగా..

భక్తులకు 'ముఖ గుర్తింపు' యాప్ అమలు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుమల కొండపై ఫేస్ రికగ్నిషన్ టెక్నాలజీని ప్రయోగాత్మకంగా అమలులోకి తెచ్చారు. దర్శనంతో పాటు, లడ్డు కౌంటర్, గదుల కేటాయింపులోనూ దీన్ని వినియోగిస్తున్నారు. దళారుల బెడద తప్పుతుందని, అక్రమాలు తగ్గిపోతాయని టీటీడీ అధికారులు చెబుతున్నా.. దీని అమలులో అనేక కష్టనష్టాలు ఎదురయ్యేలా ఉన్నాయి.



దర్శనాల సమయంలో ఫేస్ రికగ్నిషన్ ద్వారా టోకెన్ తీసుకున్న వారిని, క్యూలైన్లోకి వెళ్లే సమయంలో అదే టెక్నాలజీ ద్వారా పరీక్షించి అనుమతిస్తారు. అంటే ఇక్కడ ఒకరి బదులు మరొకరు టోకెన్ ద్వారా క్యూలైన్లోకి ప్రవేశించడం కుదరదన్నమాట. గదుల కేటాయింపు సమయంలో ఇప్పటివరకూ టోకెన్ తీసుకునేవారు, కాషన్ డిపాజిట్ కోసం తిరిగి వచ్చేవారు ఒకరే కావాల్సిన పని లేదు. కానీ ఇకపై గదుల కేటాయింపు సమయంలో ఫేస్ రికగ్నిషన్ ద్వారా ఫొటో తీయించుకున్నవారే కాషన్ డిపాజిట్ కోసం తిరిగి రావాల్సి ఉంటుంది. ఒకవేళ కుటుంబ సభ్యుల్లో వేరేవాళ్లు టోకెన్ తీసుకొచ్చినా డబ్బులివ్వలేని పరిస్థితి.

లడ్డూ కౌంటర్ల వద్ద కూడా ఇలాంటి సమస్యలే తలెత్తే అవకాశం ఉంది. గతంలో కేవలం టికెట్లు చూపించి లడ్డూలు తీసుకునే అకాశముంది, ఇప్పుడు దర్శనం చేసుకున్నవారే క్యూలైన్లోకి వెళ్లి లడ్డూలు తీసుకోవాలి. ముందు ఎవరి ఫొటో స్కాన్ చేశారో, వాళ్లే లడ్డూలకు కూడా క్యూ కట్టాల్సిన పరిస్థితి.

నెలలో ఒకసారే దర్శనమా..?

ఇక ఫేస్ రికగ్నిషన్ యాప్ ద్వారా దర్శనాలు మొదలయ్యాయి కాబట్టి సర్వ దర్శనానికి వచ్చేవారికి నెలలో ఒకసారే ఆ అవకాశం ఉంటుందని అంటున్నారు. సర్వదర్శనాల పేరుతో కొండపైనే ఉండి రోజూ స్వామి వారి దర్శనం చేసుకోవాలంటే ఇకపై కుదరకపోవచ్చు. నెల రోజుల వ్యవధిలో రెండోసారి దర్శనానికి రావాలంటే ఆర్జిత సేవలు లేదా ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ ద్వారానే అది సాధ్యమవుతుంది. ఉచిత దర్శనం నెలలో ఒకసారేనంటూ ఇప్పటికే వార్తలు హల్ చల్ చేస్తున్నాయి, విమర్శలు కూడా మొదలయ్యాయి. దీనిపై టీటీడీ క్లారిటీ ఇవ్వాల్సి ఉంది.

ఫేస్ రికగ్నిషన్ యాప్ ని టీటీడీ విజిలెన్స్ విభాగానికి, పోలీస్ విభాగానికి అనుసంధానం చేయడం ద్వారా దళారుల అక్రమాలను అత్యంత సులభంగా గుర్తించే వెసులుబాటు ఉంటుందని, అనుమానితుల కదలికల్ని కూడా అంచనా వేయొచ్చని అధికారులు భావించారు. కానీ ఆచరణలో సామాన్య భక్తజనం ఇబ్బంది పడే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. ప్రస్తుతానికి దీన్ని ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నా, పూర్తి స్థాయిలో ఇది భక్తులకు సౌకర్యవంతంగా ఉంటుందో లేదో చూడాలి. ఫేస్ రికగ్నిషన్ ద్వారా ఉపయోగాలు లేకపోయినా పర్లేదు, కొత్త సమస్యలు రాకుండా ఉంటే అంతే చాలు.

గ్రామాల్లో గాలికుంటు వ్యాధి టీకాలు



ప్రజాశక్తి- పిచ్చాటూరు: జాతీయ పశువ్యాధి నియంత్ర పథకంలో భాగంగా బుధవారం సిద్ధిరాజుకండ్రిగ, పిచ్చాటూరు, రామగిరి గ్రామాల్లో పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. డాక్టర్ ఇందిరా, డాక్టర్ ధనంజయలు, డాక్టర్ మంజుల ఆధ్వర్యంలో మండలంలో మూడు బందాలుగా ఏర్పడి బుధవారం 542 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేశారు. ఎండాకాలంలో దూడలకు, ఆవులకు తీవ్రమైన జ్వరం, నీరసం ఉంటుందని..పాల ఉత్పత్తి, పని సామర్థ్యం గణనీయంగా తగ్గపోవడం, రైతులకు ఆర్థిక నష్టం జరిగే అవకాశాలు ఉంటాయన్నారు. దూడల్లో మరణాలు తగ్గించి, ఆరోగ్యంగా ఎదగడానికి టీకాలు ఉపయోగపడుతాయని సూచించారు.

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి, తొట్టంబేడు మండలాల్లో మార్చి ఒకటో తేదీ నుంచి 31వ తేదీ వరకు పశువులకు గాలి కుంటువ్యాధి టీకాలు వేయనున్నట్లు శ్రీకాళహస్తి పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఎన్వి



శ్రీకాంత్ బాబు బుధవారం తెలిపారు. 31వ విడత జాతీయ గాలికుంటు వ్యాధి నివారణా కార్యక్రమంలో భాగంగా శ్రీకాళహస్తి, తొట్టంబేడు మండలాల పరిధిలో సుమారు 50 వేల ఆవులు, గేదెలకు టీకా పంపిణీ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నట్లు చెప్పారు. అందుకోసం 11 బృందాలను ఏర్పాటు చేశామని, పాడి రైతులు అశ్రద్ధ చేయకుండా, పాల దిగుబడి తగ్గుతుందన్న అపోహలకు పోకుండా పశువులన్నింటికీ విధిగా టీకాలు వేయించుకోవాలని సూచించారు. టీకా నిల్వల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పశు వైద్య కేంద్రానికి రూ.2 లక్షలు విలువజేసే ఐస్ లైన్డ్ రిఫ్రిజిరేటర్లను అందుబాటులో ఉంచిందని, పశు వైద్యులు పాడి రైతుల్లో అవగాహన పెంచి టీకా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

ఉపాధిలో గుర్తించిన పనులే చేయాలి



ప్రజాశక్తి-బాలాయపల్లి: గ్రామసభల ద్వారా ఏ పనులు గుర్తించారో ఉపాధి హామీ పథకంలో ఆ పనులు మాత్రమే ప్రారంభించాలని ఉపాధి హామీ ఏపీవో హరిప్రసాద్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఉన్న ఉపాధి హామీ పథకం కార్యాలయంలో ఉపాధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు ప్రారంభించి గ్రామాలను అభివద్ధి చేసుకోవాలన్నారు. పనిప్రదేశాలు మార్పు చేస్తే కఠిన చర్యలతో పాటు నోటీసులు జారీ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. కూలీలకు కూలి గిట్టుబాటు అయ్యేలా కొలతలు ఇచ్చి పనులు చేపట్టాల్సిన బాధ్యత టెక్నికల్ అసిస్టెంట్లపై ఉందన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు ఆ పనులను సక్రమంగా చేయించాలన్నారు. కార్యక్రమంలో ఈసీ సుబ్రహ్మణ్యం, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎండాకాలంలో జాగ్రత్తలు తప్పనిసరి



ప్రజాశక్తి- పిచ్చాటూరు: ప్రస్తుతం భానుడి ప్రతాపంపై ఐఎండీ తొలి హెచ్చరిక నేపథ్యంలో అధిక ఉష్ణోగ్రతల నుంచి ప్రజలను కాపాడేందుకు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ మంగళవారం మార్గదర్శకాలను జారీ చేసిందని.. ఎండాకాలం ప్రారంభం కావడంతో మండలంలోని గ్రామీణ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిచ్చాటూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ గాయత్రి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ అటవీ ప్రాంతం ఆనుకుని ఉన్న గిరిజన కుటుంబాల పిల్లలను, వద్ధులను ఎండల నుంచి జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. తగినంతగా నీరు తాగాలని.. ఓఆర్ఎస్ , మజ్జిగ, నిమ్మరసం, పండ్ల రసాలు తాగాలని తెలిపారు. వదులైన కాటన్ దుస్తులు మాత్రమే ధరించాలని, గొడుగు, క్యాప్, టవల్‌తో తలను కవర్ చేసుకోవాలన్నారు. చల్లని ప్రదేశాల్లో ఉండేలా చూసుకోవాలని, ఉదయం, సాయంత్రం వేళల్లోనే బయట పనులను చక్కబెట్టుకోవాలని తెలిపారు. మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల మధ్య బయటకు రాకూడదని.. ఒత్తిడితో కూడిన పనులకు దూరంగా ఉండాలని, చెప్పులు లేకుండా బయటకు రాకూడదని సూచించారు. అత్యవసర సమయంలో వైద్యం నిమిత్తం గ్రామంలోని ఆశ కార్యకర్తలు, సచివాలయ హెల్త్ క్లినిక్ నర్సులను సంప్రదించి వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి చేరి వైద్యం చూసుకోవాలని తెలిపారు.

వైసీపీ అభివృద్ధికి నిరంతర కృషి



ప్రజాశక్తి-డక్కిలి: మండల సోషల్ మీడియా కోకన్వీనర్‌గా ఎంపిక కావడం సంతోషంగా ఉందని అనిల్‌యాదవ్ తెలిపారు. తనపై నమ్మకం ఉంచి డక్కిలి మండల వైసీపీ సోషల్ మీడియా కోకన్వీనర్‌గా నియమించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, వెంకటగిరి సమన్వయకర్త, తిరుపతి జిల్లా అధ్యక్షులు చైర్మన్ నేదురమల్లి రామ్‌కుమార్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సంక్షేమ పథకాలను, అభివృద్ధి ఫలాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానన్నారు. నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ తోట గణేష్‌రెడ్డి, మాదిరెడ్డి మునిరామ్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు

'హిందూ ధర్మ ప్రచారానికి కృషి'



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): హిందూ ధర్మాన్ని విశ్వవ్యాప్తంగా ప్రచారం చేస్తున్న టిటిడి సహకారంతో చంద్రగిరి నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళం పరిధిలోని తిరుమలనగర్ గ్రామ పంచాయతీలో హిందు ధర్మ ప్రచారానికి తమ వంతుగా కృషి చేస్తున్నామని బీసీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గుండ్రాజు లక్ష్మీదేవి స్పష్టం చేశారు. బుధవారం తిరుమల నగర్ గ్రామపంచాయతీ ఇన్‌ఛార్జి గుండ్రాజు శివశంకరరాజు ఆధ్వర్యంలో స్థానిక గంగాదేవి ఎస్టీ కాలనీ, చెంచులక్ష్మి యానాది కాలనీల్లో ఉన్న గంగమ్మ ఆలయాలకు మైక్ సెట్ లను అందించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ తిరుమలప్రసాద్ బాబు, వార్డు మెంబర్ రాము, వైసీపీ నాయకులు శ్రావణ్ కుమార్, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ సమన్వయంతో పనిచేయాలి

ప్రజాశక్తి-సత్యవేడు: సత్యవేడు సీఐటీయూ కార్యాలయంలో బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. డివిజన్ కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ కమిటీకి పూర్వ వైభవం తీసుకురావడానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు. రాష్ట్ర మహాసభలో ఇచ్చిన తీర్మానాల అమలుకు కషి చేసేలా కమిటీని ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బాలసుబ్రమణ్యం, బాబు, సుధా, తిరుమలై, పునీత్‌కుమార్, ఏలుమలై, శేఖర్, మునిరత్నం, పంజా తదితరులు పాల్గొన్నారు.

ఎంపీగా బరిలోకి నారాయణస్వామి..?

జీడీనెల్లూరులో వ్యతిరేకతే కారణమా..!

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామికి ఈ దఫా ఎమ్మెల్యే టికెట్ దక్కకపోవచ్చు. 'రెడ్డి' సామాజికవర్గం నుంచి వ్యతిరేకత వ్యక్తం కావడం వల్లనే అధిష్టానం ఈ నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. జీడీనెల్లూరు నుంచి ఆయన ప్రాతినిథ్యం వహిస్తున్న సంగతి తెలిసిందే. వయసు పైబడిన ఆయన రాజకీయాల నుంచి తప్పుకుని, తన కూతురిని తీసుకొస్తారనే ప్రచారం జరిగింది. కానీ నారాయణస్వామి కూతురికి టికెట్ లేదని వైసీపీ అధిష్టానం తేల్చి చెప్పినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో నారాయణస్వామికే ఎంఎల్ఎ టికెట్ ఇస్తారా? లేక ఎంపిగా అవకాశం ఇచ్చి పార్లమెంట్‌కు పంపుతారా? అన్నది వేచి చూడాల్సిందే. ప్రస్తుత చిత్తూరు ఎంపి రెడ్డెప్ప మంత్రి పెద్దిరెడ్డికి నమ్మినబంటు. ఆయనను కాదని నారాయణస్వామికి ఎలా ఇస్తారనే చర్చా లేకపోలేదు.



జీడీనెల్లూరులో 'రెడ్డి' సామాజిక వర్గం ఓట్లు అధికం. గతంలో కాంగ్రెస్‌కు ఈ నియోజకవర్గం కంచుకోటగా వుండేది. ఇప్పుడా ఓట్లన్నీ వైసీపీ వైపు మళ్లాయి. ఆ సామాజిక వర్గాన్ని కించపరిచేలా నారాయణస్వామి ఇటీవల కాలంలో పదేపదే వ్యాఖ్యలు చేశారు. దీంతో ఆయనపై వారంతా గుర్రుగా ఉన్నారు. నారాయణస్వామికి ఎట్టి పరిస్థితుల్లోనూ టికెట్ ఇవ్వొద్దని, ఒకవేళ కాదు, కూడదని ఇస్తే ఓడించి తీరుతామని ఆ సామాజిక వర్గానికి చెందిన నాయకులు హెచ్చరిస్తున్నారు. క్షేత్రస్థాయిలో వైసీపీ బలంగా ఉన్నప్పటికీ, నారాయణస్వామిపై తీవ్ర వ్యతిరేకత ఉందని సర్వేల్లో తేలినట్టు సమాచారం. ఈ పరిస్థితుల్లో మాజీ మంత్రి కుతూహలమ్మ సమీప బంధువు రాజేష్‌ను అక్కడ బరిలో నిలపాలని చిత్తూరు జిల్లాకు చెందిన పెద్దాయన ఆలోచనగా చెబుతున్నారు. గెలుపే ప్రాతిపదికగా ఈ దఫా సమూల మార్పులను చేపట్టేందుకు జగన్ సిద్ధంగా ఉన్నారు. అందుకే ప్రజల్లో అనుకూలతలు లేని నాయకులను మార్చేందుకు జగన్ ఏ మాత్రం వెనుకాడరనే ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో నారాయణస్వామిని ఎంపీగా పోటీ చేయించేందుకు వైసీపీ అధిష్టానం ఆలోచిస్తున్నట్టు తెలిసింది. చిత్తూరు లోక్‌సభ స్థానం నుంచి నారాయణస్వామిని బరిలో నిలపాలని ఇప్పటికే పార్టీ పెద్దలు ఓ అవగాహనతో ఉన్నారని తెలిసింది.

బాలాయపల్లిలో అందని వైద్యం..!

- సమయపాలన పాటించని పీహెచ్‌సీ సిబ్బంది
- ప్రైవేటు ఆసుపత్రులకు పేదల పరుగులు

హస్తకావేర్లి గ్రామానికి చెందిన పల్లిపాటి కౌశల్యను బుధవారం కుక్క కరిచింది. వైద్యం కోసం బాలాయపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సాయంత్రం 3.45 గంటలకు సుదూర ప్రాంతం నుంచి అతికష్టంపై ఆటో పెట్టుకొని చేరుకొంది. అయితే అప్పటికే ఆసుపత్రికి తాళం వేసి ఉండటంతో దిక్కుతోచని పరిస్థితి. ఆమె ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లే స్థోమత లేక కన్నీరు పెట్టుకోవడం గమనార్హం.



ప్రజాశక్తి-బాలాయపల్లి

బాలాయపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో గ్రామీణ ప్రజలకు వైద్యం అంతంతమాత్రంగా అందుతోంది. వైద్యులు..వైద్య సిబ్బంది నిర్లక్ష్యంతో రోగులకు కష్టాలు తప్పడం లేదు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉండాల్సిన వైద్య సిబ్బంది సమయ పాలన పాటించడం లేదు. ఉదయం 10 గంటలకు సైతం ఆసుపత్రికి రావడం లేదు. సాయంత్రం 3 గంటలకే ఆసుపత్రికి మూత వేసి వెళ్లిపోతున్నారు. సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ పేదల ఆరోగ్యాన్ని పట్టించుకోకపోవడం దారుణమని అంబలపూడి గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇక్కడికి 35 గ్రామాల ప్రజలు వైద్యం కోసం వచ్చి పోతుంటారు. అయితే వైద్య సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో నిరుత్సాహానికి గురవుతున్నారు. బుధవారం సాయంత్రం కుక్కకాటుకు గురై వచ్చిన మహిళకు వైద్యం అందించేందుకు దిక్కులేదు. 3 గంటలకే మూత వేయడంతో ఆమె వెనుదిరిగారు. ఇప్పటికైనా వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ వచ్చిన రోగులకు సేవలందించాలని ప్రజలు కోరుతున్నారు. లేకుంటే జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడుతామని హెచ్చరిస్తున్నారు.

సైనిక్ వెల్ఫేర్ ఫండ్స్‌కు సహాయం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): జిల్లా నీటి యాజమాన్య సంస్థ వారు సైనిక వెల్ఫేర్ ఫండ్ కోసం సేకరించిన రూ.3,05353 లను చెక్కు రూపంలో డ్వామా పీడీ శ్రీనివాస్‌ప్రసాద్ బుధవారం జిల్లా కలెక్టర్ వెంకట్రమణారెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో కంప్యూటర్ ఆపరేటర్ల యూనియన్ అధ్యక్షులు గోవర్ధన్, డ్వామా సీవో భాను, సాంకేతిక సహాయకుల యూనియన్ అధ్యక్షులు చలపతి, క్షేత్ర సహాయకులు మునీశ్వర్, డ్వామా సిబ్బంది పాండు, సాయి తదితరులు పాల్గొన్నారు.



శ్రీసిటీని సందర్శించిన 'ఏక్ భారత్ శ్రేష్ట భారత్' విద్యార్థులు

ప్రజాశక్తి -సత్యవేడు: కేంద్ర విద్యామంత్రిత్వ శాఖ చొరవతో 'ఏక్ భారత్ శ్రేష్టా భారత్' యువసంఘం కార్యక్రమంలో భాగంగా అరుణాచల్ ప్రదేశ్ కు చెందిన ఎన్ఐటి, ఇతర విద్యాసంస్థల నుంచి 28 మంది విద్యార్థులు, అధ్యాపకులు బుధవారం శ్రీసిటీని సందర్శించారు. ఐదు రోజుల ఆంధ్రప్రదేశ్ పర్యటనలో భాగంగా చివరి రోజు ఇక్కడకు వచ్చిన విద్యార్థులకు శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి వారికి సాదర స్వాగతం పలికి, శ్రీసిటీ పారిశ్రామిక ప్రగతి ప్రత్యేకతలను వివరించారు. విద్యార్థులతో ముఖాముఖి చర్చల్లో పాల్గొన్న ఆయన దేశ సమైక్యతను చాటిచెబుతూ దేశంలోని విభిన్న ప్రాంతాలు, సంస్కతులు, సాంప్రదాయాలను విద్యార్థులకు పరిచయం చేసే ఈ కార్యక్రమానికి శ్రీసిటీని ఎంపిక చేయడం తాము గౌరవప్రదంగా భావిస్తున్నామన్నారు. ఏక్ భారత్ శ్రేష్టా భారత్ స్ఫూర్తికి శ్రీసిటీ చక్కని ఉదాహరణగా అభివర్ణించారు.



భారత్ తో సహా 28 దేశాలకు చెందిన పరిశ్రమలు ఏర్పాటుతో దేశ విదేశాలకు చెందిన ప్రజలు ప్రశాంత జీవనం సాగిస్తున్న ఈ ప్రాంతం వివిధ భాషలు సంస్కతులకు నిలయంగా మారిందని తెలిపారు. భవిష్యత్తులో దేశంలో విభిన్న ప్రాంతాలలో ఉద్యోగాలు, వ్యాపారాలు నిర్వహించేందుకు విద్యార్థులకు ఈ కార్యక్రమం అత్యంత ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు.

ఇంద్రియ నియంత్రణతో లక్ష్యాలను చేరుకోవాలి

ప్రజాశక్తి-క్యాంపస్: ఇంద్రియ నియంత్రణతో లక్ష్యాన్ని చేరుకోవాలని భక్తి వేదాంత విద్యాపీఠ డీన్ గౌరవ్ దర్శన్ దాస్ పేర్కొన్నారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం స్టూడెంట్ అఫైర్స్ ఆధ్వర్యంలో ముంబాయికి చెందిన భక్తి వేదాంత విద్యాపీఠ డీన్ గౌరవ్ దర్శన్ దాస్ గారిచే "ఫ్రం డిస్ట్రక్షన్ టు కాన్సెంట్రేషన్" అనే అంశం పైన మోటివేషనల్ ఉపన్యాసాన్ని విద్యార్థులకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యాచరణపై పూర్తి శ్రద్ధ చూపకపోతే లక్ష్యాన్ని చేరుకోలేరన్నారు. అనుకూలత లేని మల్టీ టాస్కింగ్ ఆశించిన ఫలితాలు ఇవ్వవన్నారు. చెడు వ్యసనాన్ని ప్రారంభ దశలో సరిదిద్దడం సులభం, ఆ చెడు అలవాటు పెరగడానికి అనుమతిస్తే తర్వాత పశ్చాత్తాప పడాల్సి ఉంటుందన్నారు. పంచేంద్రియాలు మనసును పరి పరి విధాలుగా



ఆలోచించేటట్లు చేస్తుందని, మేధస్సుతో ఇంద్రియ నిగ్రహం సాధించి సరైన దిశగా సాగాలని సూచించారు. స్టూడెంట్ అఫైర్స్ డీన్ ప్రొఫెసర్ శారద మాట్లాడుతూ, మహిళా అధ్యయన విభాగ హెడ్ డాక్టర్ నీరజ, ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అనురాధ, ప్రొఫెసర్ నిర్మల, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గాలికుంటు టీకాలు వేయిద్దాం: కలెక్టర్

ప్రజాశక్తి-తిరుపతిటౌన్: జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకం కింద గాలికుంటు వ్యాధి టీకాలు వేయించి పశువుల ఆరోగ్యాన్ని కాపాడాలని జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి అన్నారు. బుధవారం ఉదయం కలెక్టర్ కార్యాలయంలో గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 1 నుంచి 31వ తేదీ వరకు గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమం జిల్లాలోని అన్ని సచివాలయాల పరిధిలో కొనసాగుతుందని, రైతులు తప్పనిసరిగా పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా టీకాలు వేయించాలన్నారు. పశు వైద్య అధికారులు, ఆర్ బి కే లోని పశుసంవర్ధక శాఖ సహాయకులు, గోపాలమిత్రలు ఉదయమే గ్రామాలను సందర్శించి టీకాలు వేస్తారని.. ఈ



సదవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డా.రవికుమార్, ఏడీలు గురునాథ్, భవాని శంకర్, డాక్టర్లు శైలజ, నాగశిల్ప, శ్రీదేవి, శిల్పా రెడ్డి పాల్గొన్నారు.

పీడీఎఫ్ అభ్యర్థులను గెలిపించండి

ప్రజాశక్తి-గూడూరు రూరల్ : పట్టణంలోని సీఐటీయూ అనుబంధ సంస్థ ముఠా వర్కర్స్ యూనియన్లు గత మూడు రోజుల నుంచి పీడీఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని విస్తృతంగా ప్రచారం చేపడుతున్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు పి.మణి మాట్లాడుతూ



నిశ్వార్థంగా పనిచేసే పీడీఎఫ్ అభ్యర్థులు మీగడ వెంకటేశ్వరరెడ్డి, బాబురెడ్డిలను గెలిపించి శాసన మండలికి పంపాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు చంద్రయ్య, గ్రామ సేవకుల సంఘం సుబ్బయ్య, ముఠా వర్కర్స్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు జయంపులో నేదురుమల్లి పర్యటన



ప్రజాశక్తి-బాలాయపల్లి: మండలంలోని జయంపు గ్రామంలో జయంపు సహకార సంఘం అధ్యక్షుడు వెందోటి కార్తీక్ రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న వైసీపీ కార్యకర్తల సమావేశానికి పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గం కన్వీనర్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి హాజరుకానున్నారు. దీంతో ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి, తిరుపతి జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షులు నెమళ్లపూడి సురేష్‌రెడ్డి, ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి స్థలాన్ని పరిశీలన చేశారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ తాళ్లూరు వెంకట బంగారు ప్రసాద్ చౌదరి, నాయకులు నాగరాజు, గణేష్, సుధీర్, మల్లెల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

3న డయల్ యువర్ ఈవో

ప్రజాశక్తి - తిరుమల: డయల్ యువర్ ఈవో కార్యక్రమం మార్చి 3వ తేదీ శుక్రవారం ఉదయం 9 నుండి 10 గంటల వరకు తిరుమల అన్నమయ్య భవనంలో జరగనుంది. ఈ కార్యక్రమాన్ని శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్ ప్రత్యక్ష ప్రసారం చేస్తుంది. ఈ కార్యక్రమంలో భక్తులు తమ సందేహాలను, సూచనలను టిటిడి ఈవో ఎవి.ధర్మారెడ్డికి ఫోన్ ద్వారా నేరుగా మాట్లాడి తెలుపవచ్చు. ఇందుకు భక్తులు సంప్రదించవలసిన నెంబరు 0877-2263261.

చిత్తూరుకు మరో మండలం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: రాష్ట్రంలో జిల్లాల విభజన నేపథ్యంలో ఆరు కొత్త, పాత జిల్లాలకు రూరల్ మండలాలు లేవు. చిత్తూరు జిల్లా 31 మండలాలతో రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ 4న ప్రకటించింది. అయితే చిత్తూరు జిల్లాకు అర్బన్‌తో పాటు రూరల్‌ను ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇకపై చిత్తూరు సరిహద్దు ప్రాంతమంతా రూరల్‌గా పరిగణనలోకి తీసుకుంటారు. దీంతో 32 మండలాలు కానుంది.

ఆచార్య వీఎల్ఎన్ రెడ్డి సేవలు చిరస్మరణీయం



ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో వయోజన విద్య విభాగంలో ప్రారంభ ఆచార్యులుగా సేవలందించిన డా. వి యల్ యన్ రెడ్డి మతిపై ఉపకులపతి ఆచార్య కె. రాజారెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. 1972-73 సంవత్సరంలో వయోజన విద్యావిభాగాన్ని ప్రారంభించి, దేశ వ్యాప్తంగా శాఖకు గుర్తింపు తెచ్చారని, న్యూ ఢిల్లీ నెహ్రూ లిటరసీ అవార్డు కైవసం చేసుకున్న వారి ప్రతిభను విసి గుర్తు చేసుకున్నారు. జాతీయ సాక్షరతా మిషన్ రూపకల్పనలో , గ్రామీణ అక్షరాస్యత వృద్ధిలో వారి సేవలు మరువలేనివని అన్నారు.

శ్మశానంలో అభివృద్ధి పనుల పరిశీలన



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పుత్తూరు శ్మశాన వాటికలో 24 లక్షలతో నిర్మిస్తున్న ప్రహరీ పనులను బుధవారం మున్సిపల్ కమిషనర్ కేఎల్‌ఎం రెడ్డి పరిశీలించారు. ప్రహరీ, రోడ్డు నిర్మాణాల్లో నాణ్యత పాటించాలని సూచించారు. నాణ్యత లేకుంటే బిల్లులు మంజూరు చేయడం కుదరదని చెప్పారు. అలాగే ఎన్జీవో కాలనీ నుంచి చెరువుకు వెళ్లే దారికి అడ్డుగా వేసిన మట్టిదిబ్బలను వెంటనే తొలగించాలని ఇంటి యజమానులకు సూచించారు. ఎన్జీవో కాలనీకి మంచినీటిని అందించే ప్రధాన పైపులైన్ లీకేజీ, మోటారు మరమ్మతు పనులు పర్యవేక్షించారు. కార్యక్రమంలో ధర్మరాజు ఆలయ చైర్మన్ లారీ మోహన్, వైసీపీ నాయకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి-బాలాయపల్లి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని ఆర్ఐ పూర్ణ, సర్వయర్ శరత్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని వసతులు ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడైనా ప్రచారాలు చేపడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చెన్నైకు బస్సు ఛార్జీల తగ్గింపు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి నుంచి చెన్నైకి వెళ్లే ప్రయాణికులకు శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపో శుభవార్త చెప్పింది. ప్రయాణికుల సౌకర్యార్థం బస్సు ఛార్జీలు తగ్గించింది. సాధారణంగా శ్రీకాళహస్తి-చెన్నై ఎక్స్‌ప్రెస్ సర్వీసుకు ఇంతకముందు రూ.155 టిక్కెట్ ధర ఉండేది. అయితే ఇక నుంచి ప్రయాణికులు కేవలం రూ.135 మాత్రమే చెల్లిస్తే సరిపోతుందని డీఎం రాజవర్ధన్ రెడ్డి బుధవారం తెలిపారు. ఆల్ట్రా డీలక్స్‌కు ఇంతకముందు రూ.185 ఉండగా, ఇప్పుడు రూ.165 కు తగ్గించినట్లు పేర్కొన్నారు. శ్రీకాళహస్తి నుంచి చెన్నైకు మధ్య రాకపోకలు సాగించే ప్రయాణికులు, భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందగా మరోవ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. చిన్నగొట్టిగల్లు సమీపం బొల్లినేనివారిపల్లికి చెందిన రామకృష్ణనాయుడు తన ద్విచక్రవాహనంలో వెళుతుండగా కుమ్మరపల్లికి చెందిన హైదర్ వల్లి ద్విచక్రవాహనంపై చిన్నగొట్టిగల్లుకు వేగంగా వస్తూ రామకృష్ణనాయుడు వాహనాన్ని బలంగా ఢీకొన్నాడు. ప్రమాదంలో రామకృష్ణనాయుడు, హైదర్‌వల్లీ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వీరిని 108 వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆ లోపు రామకృష్ణనాయుడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు విచారణ చేస్తున్నారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం



ప్రజాశక్తి - యర్రావారిపాలెం : తలకోన అటవీ ప్రాంతంలో పాపనాశం ఫారెస్టు బీట్ పరిధిలో బుధవారం 10ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకోవడంతో పాటు ఒక స్మగ్లర్‌ను టాస్క్ ఫోర్సు పోలీసులు అరెస్టు చేశారు. టాస్క్ ఫోర్సు ఎస్పీ కే.చక్రవర్తి ఆదేశాల మేరకు డీఎస్పీ మురళీధర్ అధ్వర్యంలో ఆర్ఐ సురేష్ కుమార్ రెడ్డికి చెందిన టీమ్ మంగళవారం నుంచి కూంబింగ్ చేపట్టింది. ఆర్ఎస్ఐ లింగాధర్ బందం తిరుమల నుంచి తలకోన మీదుగా కూంబింగ్ చేపట్టింది. పాపనాశం ఫారెస్టు బీట్ పరిధిలో గుంజన సెక్షన్ వద్ద బుధవారం తెల్లవారు జామున కొంత మంది దుంగలను మోసుకుని వెళుతూ తారసపడ్డారు. వారిని హెచ్చరించి చుట్టు ముట్టే ప్రయత్నం చేయగా, దుంగలు పడేసి చీకట్లో పారిపోయారు. టాస్క్ ఫోర్సు సిబ్బంది వారిని వెంబడించడంతో ఒక స్మగ్లర్ దొరికాడు. అతను తమిళనాడు తిరువన్నామలై జిల్లా జమునామత్తూరు ప్రాంతానికి చెందిన సురేష్(27)గా గుర్తించారు. దుంగలతో పాటు స్మగ్లర్‌ను తిరుపతి టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషన్ కు తీసుకుని వచ్చి, కేసు నమోదు చేశారు. ఎస్ఐ మోహన్ నాయక్ దర్యాప్తు చేస్తున్నారు.

పొట్లపూడి రాజేష్‌కు పితృవియోగం



ప్రజాశక్తి-నాయుడుపేట: ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య యువసేన అధ్యక్షులు పోట్లపూడి రాజేష్ తండ్రి జయప్రదరావు(65) బుధవారం తెల్లవారుజామున గుండెపోటుతో కన్నుమూశారు. విషయం తెలుసుకున్న పలువురు నాయకులు, అధికారులు జయప్రదరావు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వైసీపీ మండల కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక, దారా రవి, పలువురు వైసీపీ నాయకులు నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

సీఎన్‌జీ స్టేషన్ ప్రారంభం

ప్రజాశక్తి-తిరుపతి సిటి: ఇండియన్ సిటి గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ పరిశ్రమల్లో ప్రముఖ కంపెనీల్లో ఒకటైన ఏజిఅండ్‌పి సిఎన్‌జి స్టేషన్‌ను తిరుపతిలో ప్రారంభించినట్లు ఆ సంస్థ రీజనల్ హెడ్ చిరాగ్ కె.భన్వాడియా తెలిపారు. ఆ సంస్థ ప్రారంభం సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో సిఎన్‌జి నెట్‌వర్క్‌ను బలోపేతం చేయడంలో బాగంగా తిరుపతిలో తమ స్టేషన్‌ను ప్రారంభించామన్నారు. కొత్త స్టేషన్ పారిశ్రామిక ప్రాంతంలో పరిశుభ్రమైన వాతావరణాన్ని ప్రోత్సహిస్తూ, వాహన కాలుష్యాన్ని గణనీయంగా తగ్గిస్తుందన్నారు. మేనకూరు, అత్తివరంలోని సిబ్బంది బస్సులు, రావాణా వాహనాలకు కోకో స్టేషన్ క్లినర్, ఇంధన ప్రత్యామ్నాయాన్ని అందిస్తుందన్నారు. అదనంగా స్టేషన్‌లో డిస్ట్రిక్ట్ రెగ్యులేటింగ్ స్కిడ్, డి కంప్రెషన్ యూనిట్, సౌకర్యాలు కూడా ఉన్నాయన్నారు. ఇప్పటికే మేనకూరు, అత్తివరం ఇండస్ట్రియల్ పార్కులో సహజ వాయువు పంపిణీ పైప్‌లైన్ నెట్‌వర్క్‌ను నిర్మించిందన్నారు. తిరుపతిలో వచ్చే ఏడాది 30వేల కనెక్షన్లను నమోదు చేయాలని లక్ష్యంగా పెట్టుకుందని వెల్లడించారు. ఈ ఏడాది డిసెంబరులోపు రాష్ట్రంలో 70కిపైగా సిఎన్‌జి స్టేషన్లు ప్రారంభించాలని నిర్ణయించామన్నారు. ఇప్పటికే తిరుపతిలో 12వేలకు పైగా రిజిస్ట్రేషన్లు పొందామని తెలిపారు. దీన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముస్లిం యువతికి పెళ్లి కానుక

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పట్టణంలోని 13వ వార్డుకు చెందిన నిరుపేద ముస్లిం యువతి షేక్ గౌసియా పెళ్లికి స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి కానుక పంపారు. ఆమె ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న ఎమ్మెల్యే మేనమామ కానుక కింద బీరువా, మంచం అందజేసి తన దాతత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పగడాల రాజు, ఫజల్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త మృతికి సంతాపం



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్ : చెర్లోపల్లి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త గుండేలయ్య అనారోగ్యంతో బుధవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న నగరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి గాలి భానుప్రకాష్ భౌతికకాయానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన పార్టీ కోసం సేవలు అందించారని తెలిపారు ఆయన వెంట పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నంనాయుడు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ఆనంగి ఆనంద్, ఎస్సీసెల్ నాయకులు రమేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.